క్లుప్తంగా

మారెమ్మకు ప్రత్యేక పూజలు


పూజలందుకుంటున్న మారెమ్మ

ఆస్పరి: స్థానిక మారెమ్మ ఆలయంలో మంగళవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో అర్చకులు గోవిందు ఆధ్వర్యంలో అమ్మవారికి కుంకుమార్చన, హోమం, మంగళ హారతులు తదితర కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.

బకాయిలను విడుదల చేయాలి


జూనియర్ అసిస్టెంట్ నబిరసూల్‌కు వినతి పత్రం ఇస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

ఆస్పరి: రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న విద్యార్థుల స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం ఆస్పరి రెవెన్యూ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్ నబి రసూల్‌కు ఏఐఎస్ఎఫ్ నాయకులు వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఈశ్వర్ మాట్లాడుతూ.. ప్రభుత్వం విద్యార్థులకు సంబంధించి స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వకపోవడంతో పేద విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. విద్యార్థుల సమస్యలు పరిష్కరించకపోతే ఆందోళనలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఆ సంఘం నాయకులు రాజు, ఉపేంద్ర, రవి, మహానంది, రాజు, వెంకటరాముడు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం

మద్దికెర: గర్భిణులు, బాలింతలు పోషక విలువలు కలిగిన ఆహారాన్ని తీసుకోవడం వల్ల పుట్టే పిల్లలు ఆరోగ్యంగా వుంటారని ఏఎన్ఎం గాయత్రి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని ఎం.అగ్రహారం గ్రామంలో స్థానిక అంగన్‌వాడీ కేంద్రాలలోని చిన్నారులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ప్రతి నెల వైద్య పరీక్షలు చేయించడమే గాకుండా పిల్లలకు సకాలంలో టీకాలు వేయించాలని సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీటీచర్ సుంకమ్మ వున్నారు.

పంటల బీమా చేయించుకోవాలి


పొలంబడి నిర్వహిస్తున్న వ్యవసాయశాఖ అధికారులు

తుగ్గలి : రబీలో పంటలు సాగుచేసిన ప్రతి రైతు తప్పనిసరిగా పంటల బీమా చేయించుకోవాలని వ్యవసాయశాఖ అధికారి వెంకటరాముడు సూచించారు. పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని మంగళవారం దేవనబండ, నలకదొడ్డిలో నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. పంటలు సాగు చేసిన రైతులందరూ ఈనెల 15వ తేదీ లోపు పంటల బీమా చేయించుకోవాలన్నారు. బీమా చేసుకున్న రైతులకు పంట నష్టం జరిగితే బీమా కంపెనీ నష్టపరిహారం చెల్లిస్తుందన్నారు. తుపాన్ ప్రభావంతో పప్పుశనగ మొక్క ఎదుగుదల లోపించడం, పూత, కొమ్మలు సరిగా రాలేదని చెప్పారు. నివారణకు ఎకరాకు 13: 0: 45 ఒక కేజీ, బోరాన్ 250 గ్రాములు బెల్లం లేదా 19 19 19 ఒక కేజీ ఎకరానికి ప్లాంటోఫిక్స్ 48 కలిపి పిచికారీ చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈవో రియాజ్, రైతు సేవా సిబ్బంది పాల్గొన్నారు.

నూతన వంగడాలపై మొగ్గు చూపాలి


మదార్‌పురంలో వేరుశనగ నూతన రకం పంటను పరిశీలిస్తున్న దృశ్యం

కృష్ణగిరి(వెల్దుర్తి) : అధిక దిగుబడులు ఇచ్చే నూతన వంగడాల వైపు రైతులు మొగ్గు చూపాలని నేషనల్ సీడ్స్ కార్పొరేషన్ కర్నూలు ఏరియా మేనేజర్ డాక్టర్ కేశవమూర్తి అన్నారు. వెల్దుర్తి మండలం మదార్‌పూరంలో రైతు రాజగోపాల్ సాగు చేసిన టీసీజీఎస్ 1694 వేరుశనగ నూతన రకం పంటను మంగళవారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. రైతులు పాత రకాలకు స్వస్తి పలికి నూతన వంగడాలపై దృష్టి సారించాలన్నారు. నేషనల్ సీడ్స్ కార్పొరేషన్ ద్వారా అన్ని రకాల నాణ్యమైన విత్తనాలు రైతులకు అందుబాటులో ఉంచామన్నారు. విత్తనోత్పత్తి కింద పండించిన పంట దిగుబడులను మార్కెట్ కంటే 15 శాతం అధిక ధరతో కొనుగోలు చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ అధికారి అక్బర్ బాషా, కార్పొరేష్ ప్రొడక్షన్ ఇన్‌చార్జ్ మల్లికార్జున, రైతు ఉత్పత్తిదారుల సంఘం సీఈవోలు శివ, చిన్న ఇమామ్ తదితరులు పాల్గొన్నారు.

రైతన్నపై ఎందుకింత కక్ష!

- నేటికీ అందని గత ఏడాది ఖరీఫ్, రబీ పంట నష్టపరిహారం
- ఖరీఫ్ పరిహారం రూ.3.9 కోట్లు పెండింగ్
- రబీ నష్టపరిహారం రూ.4.66 కోట్లు బకాయి
- గత రబీలో 4,694 హెక్టార్లలో దెబ్బతిన్న శనగ పంట

గత ఐదేళ్లు వ్యవసాయం పండుగలా మారింది. అప్పటి ప్రభుత్వం అన్నదాతలకు అడుగడుగునా చేదోడుగా ఉండి నడిపించడంతో సాగు సులభంగా సాగింది. భూసార పరీక్షల నుంచి దిగుబడుల విక్రయం వరకు సర్కారు అండగా నిలిచి అవస్థలను తప్పించింది. ప్రకృతి ప్రకోపానికి పంటలు నష్టపోతే అదే సీజన్‌లోనే పరిహారం అందజేసి అభయమిచ్చింది. ఆరు నెలల క్రితం పాలన పగ్గాలు మారడంతో టీడీపీ తన పాత పంథానే అనుసరిస్తోంది. దీంతో కర్షకులకు కష్టాలు తప్పడం లేదు. మంజూరైన పరిహారం కూడా అందజేయకుండా పెండింగ్‌లో ఉంచింది.


ఆస్పరి సమీపంలో సాగు చేసిన శనగ పంట

ఆస్పరి: టీడీపీ ఎప్పుడు అధికారంలో ఉన్నా.. రైతులు, వ్యవసాయంపై నిర్లక్ష్యం చూపుతుందనేది సత్యం. ప్రస్తుతం కూడా అదే తీరును అనుసరిస్తూ తన స్వభావాన్ని చాటుతోంది. గతేడాది రబీ సీజన్‌లో సాగు చేసిన పప్పు శనగ పంట వర్షాభావంతో దిగుబడి రాక రైతులు తీవ్రంగా నష్టపోయారు. దీంతో అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆస్పరి మండలాన్ని కరువు ప్రాంతంగా ప్రకటించారు. అలాగే గత ఏడాది ఖరీఫ్ సీజన్‌లో కూడా 16,613 హెక్టార్లలో వర్షాభావంతో పంటలు నష్టపోగా 16,570 మంది రైతులకు రూ.26,96,24,210 మంజూరు చేసింది. ఇందులో 1,829 మంది రైతుల బ్యాంకు ఖాతాలు సరిగా లేకపోవడంతో రూ.3,09,53,145 కోట్లు పెండింగ్ పెట్టారు. విషయం తెలుసుకున్న వ్యవసాయాధికారులు రైతుల ఖాతాలను సరి చేసి ప్రభుత్వానికి నివేదిక పంపించారు. ఇలా వివరాలు పంపించి 5నెలలు గడుస్తున్నా పరిహారం నేటికీ విడుదల చేయలేదు. ఇక గత ఏడాది రబీ సీజన్‌లో 4,694 హెక్టార్లలో పప్పు శనగతో పాటు సజ్జ, వేరుశనగ, జొన్న, కొర్ర, మొక్కజొన్న, నువ్వులు, పొద్దుతిరుగుడు పంటలు నష్టపోయారు. ఇందుకు 3,585 మంది రైతులకు రూ.4,65,96,310 నష్టపోయారని అధికారులు ప్రతిపాదనలు పంపారు. రబీ కరువు ప్రాంతంగా ప్రకటించడంతో కేంద్ర బృందం మండలంలో పర్యటించి ఆరు నెలలు గడుస్తున్నా నేటికీ పంట నష్టపరిహారం ఇవ్వలేదు. దీంతో పరిహారం కోసం కర్షకులు కళ్లు కాయలు కాచేలా ఎదురుచూస్తున్నారు. గత ఐదేళ్ల పాటు ఆయా సీజన్లలోనే పరిహారం అందజేసి అండగా నిలిచింది.

పరిహారం మంజూరు కాలేదు



గత ఏడాది 10 ఎకరాల్లో రూ.1.50 లక్ష పెట్టుబడి పెట్టి శనగ పంట సాగు చేశా. వర్షాభావంతో పంట పూర్తిగా దెబ్బతింది. కరువు ప్రాంతంగా ప్రకటించినా నేటికీ పంట నష్టపరిహారం అందలేదు. రైతులు నష్టపోయిన వెంటనే పరిహారం ఇస్తే ఊరట కలుగుతుంది. ఈ రోజు, రేపు అంటూ ప్రభుత్వం కాలయాపన చేస్తుంది. ఇది మంచిది కాదు.

– వెంకటరాముడు రైతు ఆస్పరి

సాయం అందించాలి



గత ప్రభుత్వం శనగ రైతులను ఆదుకోవడానికి ఉదారంగా పరిహారం ప్రకటించినా ప్రస్తుత కూటమి ప్రభుత్వం రైతుల పట్ల నిర్లక్ష్యం వహిస్తుంది. గత ఏడాది రబీ సీజన్‌లో ఎకరాకు రూ.15వేలు పెట్టుబడితో 8 ఎకరాలు సాగు చేసి నష్టపోయా. రబీ సీజన్ పరిహారం కోసం రైతులు ఎదురు చూస్తున్నారు.

– గాదిలింగన్న రైతు, ఆస్పరి

వివరాలు ఇచ్చినా పరిహారం రాలేదు



గత ఏడాది ఖరీఫ్ సీజన్‌లో 1.20 ఎకరాలో పత్తి పంట సాగు చేసి రూ.15వేలు నష్టపోయా. పంట నష్టపోయిన జాబితాలో నాపేరు ఉన్నా పరిహారం రాలేదు. అధికారులను అడిగితే నా బ్యాంక్ ఖాతా సరిగా లేదని చెప్పడంతో పూర్తి వివరాలు మరోసారి అందజేశా. అయినా ఇప్పటికీ పరిహారం బ్యాంకు ఖాతాలో జమ కాలేదు. పెండింగ్ లో ఉన్న పంట నష్టపరిహారాన్ని ఇచ్చేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

– అరవింద్, రైతు, చొక్కనహళ్లి

బ్యాంకు ఖాతా నంబర్లు సరి చేసి పంపాం



గత ఏడాది ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి రైతుల బ్యాంకు ఖాతా నంబర్లు సరిగాలేని ప్రభుత్వం అడిగిన వెంటనే సరిచేసి పంపించాం. ఖరీఫ్‌నకు సంబంధించి 1,829 మంది రైతులకు రూ.3కోట్లకు పైగా పరిహారం పెండింగ్‌లో ఉంది. రబీ సీజన్‌కు సంబంధించిన వివరాలను కూడా ప్రభుత్వానికి అందజేశాం.

– నరేంద్రకుమార్, ఏఓ, ఆస్పరి మండలం

అయ్యప్పస్వామికి వెండి కవచం బహూకరణ


వెండి కవచాన్ని ఊరేగింపుగా తీసుకెళ్తున్న దాత

పత్తికొండ(తుగ్గలి) : పట్టణంలోని తేరుబజారులో కొలువైన అయ్యప్పస్వామికి స్థానిక భక్తుడు వెండి కవచాన్ని బహూకరించాడు. పట్టణానికి చెందిన కుర్వ బ్రహ్మయ్య రూ.3లక్షల విలువ చేసే వెండి కవచాన్ని తయారు చేయించి మంగళవారం కుటుంబ సభ్యులతో కలిసి ఆలయానికి వెళ్లి అందజేశారు. అనంతరం స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అయ్యప్పమాల ధారులకు తీర్థప్రసాదాలు అందజేసి అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా మాలధారులు దాతను సన్మానించారు.

శనగ పంటకు 'కాలర్ రాట్'


శనగ పంటను పరిశీలిస్తున్న ఏఓ రవి

మద్దికెర : రబీ సీజన్‌లో సాగుచేసిన పప్పుశనగ పంటలో కాలర్‌రాట్ తెగులు ఆశిస్తున్నట్లు గుర్తించామని, రైతులు సకాలంలో యాజమాన్య పద్ధతులు పాటించి పంటలను సంరక్షించుకోవాలని ఏఓ రవి సూచించారు. మంగళవారం మద్దికెర పరిసరాలలో పప్పుశనగ పంటలు పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ వాతావరణంలో మార్పులు వల్ల కాలర్ రాట్ తెగుళ్ల ఆశించిందన్నారు. కాలర్‌రాట్ తెగులు సోకిన మొక్కలు పసుపు పచ్చగా మారి చనిపోతాయన్నారు. ఈ తెగులు నివారణకు 2 కిలోల ట్రైకోడెర్మా విరిడితో పాటు 2 కిలోల సుడొమోనాస్‌ను ఇసుకలో కలుపుకొని పొలంలో చల్లుకోవాలని సూచించారు.

టమాటకు గిట్టుబాటు ధర కల్పించాలి


రైతులతో మాట్లాడుతున్న మునిస్వామి

ఆస్పరి: టమాటకు గిట్టుబాటు ధర కల్పించి రైతులను ఆదుకోవాలని రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యుడు మునిస్వామి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని చిరుమాన్‌దొడ్డి గ్రామ సమీపంలోని టమాట పొలాలను పరిశీలించి రైతులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 10 రోజుల నుంచి ఆస్పరి, బిల్లేకల్లు మార్కెట్లలో టమాట ధర పూర్తిగా పడిపోయిందన్నారు. 25 కిలోల టమాట బాక్స్ రూ.150 ధర పలుకుతుండడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మార్కెట్లలో గిటుబాటు ధర లేనందున ప్రభుత్వమే టమాట కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని కోరారు.

ముందస్తుగా అద్దె చెల్లించాలి


ఆలూరులో గ్రామ పంచాయతీ షాపింగ్ కాంప్లెక్స్‌ను పరిశీలిస్తున్న పత్తికొండ డీఎల్‌పీఓ వీరభద్రప్ప

ఆలూరు రూరల్: మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలో ఇటీవలే నిర్వహించిన షాపింగ్ కాంప్లెక్స్ బహిరంగ వేలాల్లో షాపులు దక్కించుకున్న వ్యాపారస్తులు ఈ నెల 31వ తేదీలోపు ఏడాది అద్దె ముందస్తుగా చెల్లించాలని పత్తికొండ డీఎల్‌పీఓ వీరభద్రప్ప తెలిపారు. ఆయన మంగళవారం సంత మార్కెట్‌లోని 27 షాపులను పరిశీలించారు. నెలాఖరులోగా షాపులలో విద్యుత్ సౌకర్యం కల్పించాలని సిబ్బందికి సూచించారు. వేలం పాటలో పాల్గొనేందుకు చెల్లించిన డిపాజిట్ నగదు పోను 2025 డిసెంబర్ నాటికి అయ్యే అద్దె నగదును ముందుగానే చెల్లించి షాపులు తీసుకోవాలన్నారు. అద్దె చెల్లించని వారి షాపులకు మరోసారి వేలం నిర్వహిస్తామన్నారు. అలాగే పంచాయతీ పరిధిలో ఇంటి పన్ను వసూలు వేగవంతం చేయాలని గ్రామ పంచాయతీ సిబ్బందికి చెప్పారు. పట్టణంలో 4 వేలకు పైగా ఉన్న గృహాల నుంచి రూ.24 లక్షలు పన్నుల రూపంలో వసూలు కావాల్సి ఉందన్నారు. ఇప్పటివరకు 25 శాతం మాత్రమే పన్నులు వసూలయ్యాయని, వచ్చే ఏడాది మార్చి చివరికల్లా లక్ష్యాన్ని పూర్తి చేయాలని ఆదేశించారు. ఇన్‌చార్జ్ ఈఓపీఆర్డీ, పంచాయతీ ఈఓ ప్రభాకర్ గ్రామ పంచాయతీ సిబ్బంది ఉన్నారు.

రోడ్ల మరమ్మతులకు రూ.2.01 కోట్లు మంజూరు


మాట్లాడుతున్న ఆర్అండ్‌బీ డీఈ శివరుద్రకుమార్

పత్తికొండ(తుగ్గలి): డివిజన్‌లో 120కిలో మీటర్ల మేర రోడ్ల మరమ్మతుల కోసం రూ.2.01 కోట్లు మంజూరయ్యాయని ఆర్ అండ్‌బీ డీఈ శివరుద్రకుమార్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ.. ప్యాపిలి–పత్తికొండ రోడ్డులో 6కిలోమీటర్ల రూ.15లక్షలు, తుగ్గలి–నంచర్ల 7 కిలోమీటర్లకు రూ.7లక్షలు, గుత్తి–పత్తికొండ 9 కిలోమీటర్లకు రూ.13లక్షలు, పత్తికొండ బైపాస్ రోడ్డులో 3.86 కిలోమీటర్లకు రూ.5లక్షలు, మద్దికెర– పత్తికొండ–దేవనకొండ రోడ్డుకు 10 కిలోమీటర్లకు రూ.25లక్షలు మంజూరయ్యాయన్నారు. గుంతకల్లు–పత్తికొండ 20కిలోమీటర్లకు రూ.40లక్షలు, ఆలూరు–ఆస్పరి– జోహరాపురం రోడ్డుకు 10 కిలోమీటర్లకు రూ.20లక్షలు, కరివేముల–ఆరేకల్లు రోడ్డుకు 22 కిలోమీటర్లకు రూ.40లక్షలు, కర్నూలు–బళ్లారి రోడ్డు 20 కిలోమీటర్లకు రూ.18 లక్షలు, గుత్తి–ఆదోని రోడ్డుకు 12 కిలోమీటర్లకు రూ.18లక్షలు చొప్పున కేటాయించారన్నారు. ఇప్పటికే 70శాతం పనులు ప్రారంభమయ్యాయని తెలిపారు. సంక్రాంతిలోపు రోడ్లపై గుంతలన్నీ మరమ్మతులు చేస్తామని చెప్పారు.

వేదావతి ప్రాజెక్టుకు నిధులు కేటాయించాలి


మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు మద్దిలేటి శెట్టి

ఆలూరు/ఆలూరు రూరల్: వేదావతి ప్రాజెక్టు నిర్మాణానికి నిధులు కేటాయించాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు మద్దిలేటి శెట్టి, జిల్లా కమిటీ సభ్యుడు భూపేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో మండల కార్యదర్శి రామాంజనేయులు అధ్యక్షతన సమితి సభ్యులతో సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. 2024–25 బడ్జెట్‌లో వేదావతి ప్రాజెక్టు నిర్మాణానికి నిధులు కేటాయించి 8 టీఎంసీల సామర్థ్యంతో ప్రాజెక్టను పూర్తి చేయాలన్నారు. హాలహర్వి మండలం బిలేహాల్ గ్రామ సమీపంలో పనులు ఆగిపోయాయని వాటిని తిరిగి ప్రారంభించాలన్నారు. రైతు సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు లక్ష్మీకాంత్ రెడ్డి, మండల అధ్యక్ష, కార్యదర్శులు గోపాల్, రంగన్న నాయకులు సిద్దప్ప, రాముడు, వన్నూర్ తదితరులు ఉన్నారు.

జయప్రదం చేయాలి


మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య

ఆస్పరి: ఈనెల 26వ తేదీన జిల్లాలోని అన్ని గ్రామాల్లో సీపీఐ శత జయంతి ఉత్సవాలను నిర్వహించి జయప్రదం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య పిలుపునిచ్చారు. ఆస్పరి సీపీఐ కార్యాలయంలో మంగళవారం ఆ పార్టీ నాయకులు, కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గిడ్డయ్య మాట్లాడుతూ.. ప్రజా సమస్యల పరిష్కారం కోసం సీపీఐ అలుపెరగని పోరాటం చేస్తోందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజల సమస్యలను పరిష్కరించడంలో విఫలమయ్యాయన్నారు. సమస్యల పరిష్కారం కోసం ప్రజలు, రైతులు, కార్మికులు సంఘటితంగా పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. సీపీఐ మండల కార్యదర్శి విరూపాక్షి, నాయకులు కృష్ణమూర్తి, బ్రహ్మయ్య, బడేసాహెబ్, రంగన్న, హనుమంతు, రాజాచంద్ర, దస్తగిరి తదితరులు పాల్గొన్నారు.

తూతూమంత్రంగా రెవెన్యూ సదస్సులు


రెవెన్యూ సదస్సులో పాల్గొన్న పత్తికొండ ఆర్డీఓ భరత్‌నాయక్


రైతుల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దార్ గోవింద్ సింగ్


తుగ్గలి మండలం ముక్కెల్లలో అర్జీలు పరిశీలిస్తున్న తహసీల్దార్ రమాదేవి

దేవనకొండ: మండలంలోని గ్రామాల్లో రెవెన్యూ సదస్సులను అధికారులు తూతూ మంత్రంగా నిర్వహిస్తున్నారు. కనీసం ప్రజలకు సమాచారం లేకపోవడంతో మొక్కుబడిగా సదస్సులు జరుగుతున్నాయి. మంగళవారం జిల్లెడబుడకల గ్రామంలో జరిగిన రెవెన్యూ సదస్సులో పత్తికొండ ఆర్డీఓ భరత్‌నాయక్ పాల్గొన్నారు. కనీసం ఆ ఊరి ప్రజలు, మీడియాకు, రెవెన్యూ సిబ్బందికి ఎలాంటి సమాచారం కూడా అందించలేదు. దీంతో మేజర్ పంచాయతీలో కేవలం ఏడు దరఖాస్తులు మాత్రమే వచ్చాయి. దీంతో రెవెన్యూ సిబ్బంది ఎంత మాత్రం సదస్సులను నిర్వహిస్తున్నారోనని ప్రజలు వాపోతున్నారు. తహసీల్దార్ లోకేశ్వరరావు, డిప్యూటీ తహసీల్దార్ సుదర్శనం, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

రైతులు సద్వినియోగం చేసుకోవాలి

ఆస్పరి: భూ సమస్యల పరిష్కారానికై నిర్వహించే రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని డిప్యూటీ తహసీల్దార్ రామేశ్వరరెడ్డి సూచించారు. మండలంలోని ములుగుందం గ్రామంలో మంగళవారం రెవెన్యూ సదుస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డీటీ మాట్లాడుతూ రెవెన్యూ సదస్సులో నోషనల్ ఖాతా సమస్యలు, రైతుల పేర్లు, సర్వే నంబర్లలో తప్పులుంటే దరఖాస్తు చేసుకోవాలని, విచారణ చేసి సమస్యను పరిష్కరిస్తామని చెప్పారు. ములుగుందం, పలకూరబండ గ్రామాలకు చెందిన 12 మంది రైతులు భూ సమస్యలను పరిష్కరించాలని దరఖాస్తు చేసుకున్నట్లు చెప్పారు. రెవెన్యూ, సచివాలయ సిబ్బంది, మాజీ సర్పంచ్ మల్లికార్జునరెడ్డి పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారమే లక్ష్యం

ఆలూరు రూరల్: భూ సమస్యలను పూర్తిస్థాయిలో పరిష్కరించడమే రెవెన్యూ సదస్సుల లక్ష్యమని తహసీల్దార్ గోవింద్ సింగ్ అన్నారు. మొలగవల్లి గ్రామంలో మంగళవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ..ఆన్‌లైన్ అండంగల్ మార్పులు, చేర్పులు, మిగులు భూమి ఆన్‌లైన్, రస్తా వివాదాలు, తదితర సమస్యలు ఉంటే అర్జీల రూపంలో అందజేయాలని రైతులకు సూచించారు. సదస్సులో 18 అర్జీలు అందినట్లు చెప్పారు. ఇందులో 14 అర్జీలు అండగల్‌లో మార్పులు, చేర్పులు, మిగులు భూమి సమస్యలపై 4 అర్జీలు అందినట్లు తెలిపారు. రైతులు అందించిన అర్జీలను 45 రోజుల్లోగా పరిష్కరిస్తామని తహసీల్దార్ వెల్లడించారు. సర్పంచ్ మోహన్ రాజు, ఆర్ఐ బసవన్న గౌడ్, గ్రామ వీఆర్వో రామాంజినేయులు, గ్రామస్తులు ఉన్నారు.


ములుగుందంలో రెవెన్యూ అధికారులకు దరఖాస్తులు ఇస్తున్న రైతులు

సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు

పత్తికొండ(తుగ్గలి) : భూ సమస్యల పరిష్కారానికి ప్రతి రెవెన్యూ గ్రామంలో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామని ఆర్డీఓ ఎస్ భరత్‌నాయక్ తెలిపారు. మంగళవారం జూటూరులో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆర్డీఓ పాల్గొని మాట్లాడారు. రెవెన్యూ సదస్సుల్లో భూ సరిహద్దు, విస్తీర్ణంలో సమస్యలు, నిషేధిత భూముల జాబితా, మ్యూటేషన్, అండంగల్, సర్వే, భూ రికార్డుల్లో సవరణలకు సంబంధించి అర్జీలు స్వీకరించి, పరిష్కార దిశగా చర్యలు తీసుకుంటామన్నారు. సదస్సులో వివిధ సమస్యలపై రైతుల నుంచి 10అర్జీలు స్వీకరించారు. సర్పంచ్ జయశ్రీ, ఎంపీటీసీ సభ్యురాలు రంగమ్మ, ఆర్ఐ శ్రీనివాసులు, సర్వేయర్ గాదిలింగప్ప, వీఆర్వో వాసుదేవయ్య పాల్గొన్నారు.

తుగ్గలి మండలంలో..

మండలంలోని ముక్కెల్లలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో రైతుల నుంచి 11 అర్జీలు స్వీకరించారు. తహసీల్దార్ రమాదేవి, సర్పంచ్ తలారి సుజాత, డీటీ నాగరాజు, సర్వేయర్ సుధాకర్, వీఆర్వోలు రంగప్ప, రహిమాన్ పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలి

మద్దికెర : ప్రభుత్వం నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల ప్రత్యేక అధికారి ఉమాదేవి, తహసీల్దార్ హుస్సేన్‌సాహెబ్ సూచించారు. మంగళవారం మండల పరిధిలోని ఎడవలి గ్రామంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా రైతుల నుంచి సమస్యలపై అర్జీలను స్వీకరించారు.

హాలహర్వి: మండలంలోని బాపురం, పచ్చారపల్లి గ్రామాల్లో మంగళవారం రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ నజ్మాభాను మాట్లాడుతూ భూ సమస్యలు ఉన్న రైతులు అర్జీల రూపంలో దరఖాస్తులు చేసుకోవాలని, పరిశీలించి పరిష్కారం చూపుతామన్నారు. సర్పంచ్ భాగ్యమ్మ, ఎంపీటీసీ పాల్‌రెడ్డి, వీఆర్వోలు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

హొళగుంద: మండలంలోని ఎల్లార్తి గ్రామంలో సర్పంచ్ కురువ చాముండేశ్వరి ఆధ్వర్యంలో తహసీల్దారు సతీష్ అధ్యక్షతన రెవెన్యూ సదస్సు జరిగింది. భూ సమస్యలకు సంబంధించి 13 మంది రైతులు అర్జీలను సమర్పించారు. ప్రధానంగా ఆన్‌లైన్ అడంగల్‌లో భూ విస్తీర్ణంలో హెచ్చుతగ్గులు,మిగులు భూములుగా నమోదుకావడం, ఆన్‌లైన్‌లో రైతుల పేర్లు మారిపోవడం ఇతర సమస్యల గురించి రైతులు అర్జీలు ఇచ్చారు. అదే విధంగా ఇళ్ల స్థలాలు, పక్కా ఇళ్లు ఇతర వాటిపై కూడా అర్జీలు వచ్చినట్లు తహసీల్దారు సతీష్ తెలిపారు. డీటీ నిజాముద్దీన్, వీఆర్ఓ ప్రహ్లాద పాల్గొన్నారు.

కృష్ణగిరి : భూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామని రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ చంద్రశేఖర్ కోరారు. మంగళవారం మండల పరిధిలోని చిట్యాలలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు.

వెల్దుర్తి మండలంలో..

వెల్దుర్తి మండలంలోని లక్ష్మీనగరంలో రెవెన్యూ అధికారులు రెవెన్యూ సదస్సు నిర్వహించారు. తహసీల్దార్ చంద్రశేఖరవర్మ ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు.

ఆప్టా సభ్యత్వ నమోదు

కృష్ణగిరి(వెల్దుర్తి) : ఆప్టా రాష్ట్ర అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం మండలంలోని నాగలాపురం, అల్లుగుండు, వెల్దుర్తి మెయిన్, రామళ్లకోట పాఠశాలల్లో ఉపాధ్యాయ సభ్యత్వ నమోదు కార్యక్రమం సంఘం జిల్లా అధ్యక్షుడు మధుసూదనరెడ్డి ఆధ్వర్యంలో చేపట్టారు.

ప్రమాదకరంగా కంపచెట్లు

ఆస్పరి: ఆస్పరి నుంచి ఐనకల్లు మీదుగా యాటకల్లు గ్రామానికి వెళ్లే రోడ్డులో కంప చెట్లు ఏపుగా పేరగడంతో వాహనదారులకు ఇబ్బంది మారాయి. కంప చెట్లు రోడ్డుకు ఇరువైపులా 2కిలో మీటర్లు మేర ఉండడంతో అటు, ఇటు నుంచి వచ్చే వాహనాలు కనబడక ప్రమాదాలు చోటు చేసుకునే అవకాశం ఉంది. ఈ రోడ్డుపై నిత్యం తొగలుగల్లు, దొడగొండ, కలపరి, కైరుప్పల, యాటకల్లు, ఐనకల్లు గ్రామస్తులు రాకపోకలు సాగిస్తున్నారు. రోడ్డుకు ఇరువైపులా కంప చెట్లను తొలగించాలని వాహనదారులు అధికారులను కోరుతున్నారు.


రోడ్డుకు ఇరువైపులా పెరిగిన కంప చెట్లు

చందాలు వేసుకుని గ్రావెల్ రోడ్డు


నంచర్ల గ్రామస్తులు ఏర్పాటు చేసుకున్న గ్రావెల్ రోడ్డు

చిప్పగిరి: కూటమి ప్రభుత్వం హామీలు నీటిమూట లేనని నంచర్ల గ్రామస్తులు పెదవివిరుస్తున్నారు. మారుమూల గ్రామాలకు సైతం బీటీ రోడ్లు వేస్తామని చెప్పిన హామీలు ఇప్పుడేమయ్యాయని ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వం రోడ్డు నిర్మిస్తుందనే నమ్మకం లేక చివరకు గ్రామస్తులే సొంతంగా చందాలు సేకరించి గ్రావెల్ రోడ్డు వేయించుకున్నారు.

వివరాలు.. మండలంలోని నంచర్ల గ్రామంలో 2,666 మంది జనాభా ఉన్నారు. ఈ గ్రామం అభివృద్ధికి ఆమడ దూరంలో నిలిచిపోయింది. గ్రామం నుంచి నంచర్ల స్టేషన్ వరకు రోడ్డు పూర్తిగా దెబ్బతినడం, పొలాలకు వెళ్లేందుకు ఇదే ప్రధాన రహదారి కావడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సమస్యపై పలుమార్లు అధికారులకు విన్నవించుకున్నా ఎలాంటి ఫలితం లేకుండా పోయింది. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఆరు నెలలు దాటినా నంచర్ల గ్రామానికి రోడ్డు నిర్మాణ విషయంలో ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో గ్రామస్తులు తీవ్ర అసంతృప్తికి గురయ్యారు. తమ సమస్యను తామే పరిష్కరించుకోవాలని నిర్ణయించుకుని గ్రామంలో ఇంటింటికీ తిరిగి చందాలు సేకరించారు. రూ.1.5 లక్షలు పోగవ్వడంతో ఆ నిధులతో గ్రావెల్ రోడ్డును ఏర్పాటు చేసుకున్నారు. చందాలు వేసుకుని రోడ్డును బాగు చేయించుకోవాల్సి వచ్చిందని, ప్రజలకు కనీస సౌకర్యాలు కల్పించలేని ప్రభుత్వం ఎందుకని ఆ గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు.

మారెమ్మ దేవర ప్రారంభం

కృష్ణగిరి: మండల పరిధిలోని పెనుమాడ గ్రామంలో వెలసిన మారెమ్మ దేవత దేవర ఉత్సవాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. అమ్మవారికి నైవేద్యంతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవాల సందర్భంగా బంధు మిత్రుల రాకతో గ్రామంలో సందడి నెలకొంది. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకుండా ఎస్ఐ మల్లికార్జున ఆధ్వర్యంలో గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.